నూతిలో కప్ప

పుట్ల హేమలత



అప్పుడే రైలు ప్లాట్‌ఫారం వదలి పోవడంతో స్టేషన్‌లో హడావుడి తగ్గింది. పోర్టర్లు బేరాలు కుదుర్చుకుని లగేజీలతో బయటికెళ్లాక స్టేషన్ మరింత పల్చబడింది.

'శీనుగాడు' ఎడంచేతికి పల్లీల బుట్ట తగిలించుకుని ప్లాట్‌ఫారం మీద ఒక మూలగా కూర్చున్నాడు. అరచేతిలోని చిల్లర పైసలు లెక్కించుకుని చొక్కా జేబులో వేసుకున్నాడు. వేరుశెనక్కాయల బుట్టను కింద పెట్టి అందులో అడుగునవున్న చిన్న ప్లాస్టిక్ కవరును పైకితీసి జేబులోని చిల్లరను అందులో వేశాడు, మళ్లీ ఆ కవరును యధాస్థానంలో పెట్టేసి లేచి నుంచున్నాడు. ఇంకా కోటిగాడు రాలేదేమిటి చెప్మా అనుకున్నాడు. ఇంకో పావుగంటలో పాసింజరు వస్తుంది. అప్పుడు కనీసం నాలుగు రూపాయలకు అమ్ముకుంటే గానీ ఈరోజు తిట్లు తప్పవు అనుకున్నాడు. మళ్లీ ఓసారి బుట్టలో చెయ్యి పెట్టి కవరు జాగ్రత్తగా వుందో లేదోనని తడిమి చూసుకుని తృప్తిగా తలాడించాడు.

క్రిందటిసారి ఇలాగే అజాగ్రత్తగా చిల్లర జేబునిండా వేసుకుని తిరుపతి కెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ కంపార్ట్‌మెంట్ ఎక్కేడు. అసలే రద్దీగా ఉంది. జనంతో పాటు తనూ తోసుకుంటూ ఎక్కి పల్లీలు పల్లీలు! అంటూ కీచుగా అరిచాడు. పై సీట్లో కూర్చున్న నాలుగేళ్ల పిల్లాడు ఆశగా చూశాడు. శీనుగాడి చేతిలోని బుట్టవైపు. అది గమనించిన శీను రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ అరిచాడు.

'అమ్మా! అవి కావాలి' మారాం చేస్తూ అడిగాడు అబ్బాయి-అబ్బాయి తల్లి కాసేపు వద్దని వారించింది-ఆ తర్వాత 'ఓ రూపాయికివ్వు' అంది రెండు నోటు అందిస్తూ.

శీను వేరుశెనక్కాయలు పొట్లం కట్టి పిల్లాడి చేతిలో పెట్టాడు. చిల్లర కోసం జేబులో చెయ్యి పెట్టి గతుక్కుమన్నాడు. ఎవడో జేబు కొట్టేశాడు. శీను పరిస్థితి కళ్లనీళ్ల పర్యంతమైంది. రైల్వే స్టేషన్లలో జేబులు కొట్టేసే వాళ్ల గురించి శీనుకి తెలుసు. కానీ తనలాటి దిక్కులేని పేదవాడి జేబులు కూడా ఖాళీచేసే మనుషులున్నారని వాడికి మొదటిసారిగా తెలిసింది. రైలుదిగి ఎలా వచ్చాడో వాడికే తెలియదు. కళ్లనీళ్లు తుడుచుకుంటూ తురాయి చెట్టు కింద కూర్చున్నాడు. కళ్లముందు ఓబులమ్మ రూపం కదిలాడేసరికి నిలువునా నీరుగారిపోయాడు.

శీను ఎప్పుడు ఎక్కడ పుట్టాడో ఎవరికీ తెలియదు. ఓరోజు ఈ రైలు స్టేషన్లోనే ఏ తల్లో వదిలేసి పోయింది. అప్పటికి వాడికి మూడేళ్లు, స్టేషన్ బయట గారెలమ్ముకునే ఓబులమ్మ శీనుని చేరదీసింది. శ్రీనివాసరావని పేరు కూడా పెట్టింది. కానీ వాడినెవరూ అంత పెద్ద పేరుతో పిలవరు. శీనుగాడు అంటారు. ఎవరన్నా పేరడిగినప్పుడు మాత్రం 'శ్రీనివాసరావు' అని గర్వంగా చెప్పుకుంటాడు.

ఓబులమ్మ పాతికేళ్ల కొడుకు దేశాలు పట్టిపోయాడు. ఎప్పటికైనా తిరిగొస్తాడనే ఆశతో కొడుక్కోసం అంతో ఇంతో వెనకే

సుకొస్తుంది. శీనుకి పదేళ్ల వయసొచ్చాక రైల్లో తినుబండారాలు అమ్ముకు రావటానికి ఏర్పాటు చేసింది.

శీనుకి ఇదేదో గమ్మత్తుగా అన్పించింది. కానీ అందులోని కష్టనష్టాలు తొందరలోనే తెలిసొచ్చాయి. మొదట్లో అయితే తన కంటే ముందు రైల్లో వ్యాపారాలు సాగించేవారు తనని బలవంతంగా బండి దింపేసేవారు. అందరికంటే చిన్న వాడని దబాయించేవారు. ఖాళీ చేతుల్తో ఇంటికెళితే ఓబులమ్మ చేతిలో బడిత పూజ తప్పేదికాదు.

"ఒరేయ్! ఈ లోకంలో బతకడానికి నీ అమాయకత్వం పనికి రాదురా. దబాయించి నోడిదేరా రాజ్యం! అంటూ వుండేది.

ఎలాగైతేనేం శీనుకి ఇప్పుడిప్పుడే లోకం తెలుస్తోంది. వాడు నూతిలో కప్పలాంటివాడు. ఊహ తెలిసినప్పటి నుండీ ఇప్పటివరకూ శీనుకి తెల్సిన అతి పెద్ద లోకం రైల్వే స్టేషనే. ప్రతి రోజూ స్టేషన్లో రక రకాల మనుషుల్ని చూస్తాడు. విదేశీయుల్ని, రక రకాల వస్త్రధారణ, వేషభాషలు కల్గిన వాళ్లనీ, ఎన్నో రకాల మనస్తత్వాలు కల్గిన వాళ్లనీ ఆసక్తిగా చూస్తుంటాడు.

'సీనుగా ఒరేయ్! ఏంట్రా ఆలోచన? పదినిమిషాల్లో పాసింజరు వస్తాది. ఇందాక ఎంతలాభం వచ్చిందేటి?' కళ్లెగరేస్తూ అడిగాడు కోటిగాడు.

శీను సమాధానం దాటేసి కోటీ! మీ అక్కవాళ్ల ఊరు ఎలాగుంటదిరా?" అన్నాడు.

కోటిగాడు ఉత్సాహంగా ముందుకి వంగి చెప్పాడు. ఓహో! హైదరాబాదా? నాకు చెప్పటానికి రాదులే. నువ్వే చూడాలి. పెద్ద పెద్ద రోడ్లూ, కళ్లు జిగేల్మనే లైట్లూ ఒకటేమిటి? అంతా జాతరలాగా ఉంటది. నువ్వెప్పుడైనా రంగు సోడా తాగావా?" నోరు చప్పరిస్తూ అడిగాడు.

లేదన్నట్లు పెదవి విరిచాడు శీను.

"రే శీను! నువ్వు పాసింజరులో వరంగల్లు దాకా పోయి పల్లీలు అమ్ముకోరాదూ?" అన్నాడు. కాస్సేపాగి మళ్లీ కోటిగాడే అన్నాడు. అయినా మీ ఓబులమ్మ ఒప్పుకోదులే రాక్షసి" శీను ఆశగా చూశాడు కోటిగాడి వైపు.

"అవున్రా! నాకూ ఇష్టమే. నేను పుట్టి
నప్పట్నించీ ఈ వూరు తప్ప వేరే వూరు చూల్లేదు తెల్సా?" దిగాలుగా అన్నాడు.

శీను బిక్కముఖం చూసి కోటిగాడికి నవ్వొచ్చింది. నేనైతే ఎన్నోసార్లు వరంగల్లుకి పాసింజర్లో ఎల్లేను. ఎంత ఒక్క గంట ప్రయాణం. రైలు కదుల్తుంటే మనం పెట్టంతా తిరిగి అమ్ముకోవచ్చు. భలేగుంటుందిలే!" ఊరిస్తూ అన్నాడు.

ధన్ ధన్ మని చప్పుడు చేస్తూ వచ్చి ఆగింది రైలు.

"ఒరేయ్! శీనుగా నువ్వు ఆడోళ్ల పెట్లోకెళ్లు, నేను జనరల్ పెట్టెక్కుతా అంటూ వెళ్లిపోయాడు.

ఆరోజంతా అన్యమనస్కంగానే ఉన్నాడు. అన్నం కూడా సరిగ్గా తిన్లేదు. కుక్కి మంచంలో పడుకుని ఆకాశంకేసి చూస్తుండిపోయాడు. సాయంత్రం నుండీ వాడి వాటం గమనిస్తూనే వుంది ఓబులమ్మ.

"శీను అట్టాగుండా వేమిరా?" అంది చివరికి.

శీను ఒక్క క్షణం తటపటాయించి చెప్పాడు.

"అత్తా! కోటిగాడితో పాటు నేనూ వరంగల్లు దాకా ఎళ్లి పల్లీలమ్ముకొస్తాను. మనకీ మంచి లాభం వుంటదంట" కళ్లు పెద్దవి చేస్తూ అన్నాడు.

ఓబులమ్మ నవ్వుకుంది. ఆశగా చూస్తున్న శీను తల నిమురుతూ అంది.

నువ్వు పిల్లాడివనీ, లోకం తెలీదని ఇన్నాళ్లూ ఎక్కడికీ పంపలేదు. చేతికందిన కొడుకు ఎటో వెళ్లిపోయాడు. నిన్ను ఒంటరిగా పంపితే ఏం జరుగుతుందోనని నాభయం. నేను పైకి గడుసుగా కనబడ్డా నా మనసు నీకుతెలీదురా. నువ్వు ఆశపడ్డావు కాబట్టి కోటిగాడితో రేపు నిన్ను వరంగల్లు దాకా పంపిస్తాను. సులువుగా వుంటే రోజూ వెళ్లు, లేకుంటే లగిపో. సరేనా! అంది.

శీను నమ్మలేనట్టు చూశాడు. ఆనందంతో ఆరాత్రి నిద్రేపట్టలేదు. తెల్లవారుజామున మగతనిద్రలో రంగు రంగుల కలలు...

కదిలి వెళ్తున్న రైల్లో పల్లీలు అమ్ముతున్నట్లు సరుకంతా అమ్మేసి రూపాయల నోట్లు ఓబులమ్మ చేతిలో పోస్తున్నట్లూ, ఓబులమ్మ రోజూ తనకు రైల్లో వెళ్లమన్నట్లూ ఒకటే కలలు!

"శీను జాగ్రత్తరా! కోటిగాడితో కల్సి జాగ్రత్తగా తిరిగొచ్చెయ్" కడవ తీసుకుని నీళ్లకెళ్తూ చెప్పింది ఓబులమ్మ.

కోటిగాడితో కల్సి ఉత్సాహంగా అడుగు ముందుకేశాడు శీను.

వాళ్లెక్కిన రైలు 'ఆలేరు' స్టేషను దాటింది. కోటిగాడు మరో పెట్టెలో ఉన్నాడు. సీనుకి ఎంతో ఉత్సాహంగా ఉంది. బేరాలు అయ్యాక డోర్ దగ్గర నిలబడి కదిలే చెట్లనీ, కరెంటు స్తంభాలనీ చూస్తున్నాడు. కంపార్టుమెంటు చాలా రద్దీగా వుంది. ఇద్దరు తాగుబోతులు నోటికొచ్చినట్లు బండబూతులు తిట్టుకుంటున్నారు.

శీను లోకాన్ని మర్చిపోయి ప్రకృతి అందాల్ని వింతగా చూస్తున్నాడు. వాడి వెనకాల ఆ ఇద్దరి గొడవా కొట్టుకునే వరకూ వచ్చింది. ఒకడు కాళ్లు శీను వీపుకి తగుల్తున్నాయి. శీనులేచి నుంచున్నాడు లోపలికి జరగడానికి! అంతే!

వాళ్లలో ఒకడు తూలి శీనుమీద పడ్డాడు. శీను విసురుగా ఎగిరి రైల్లోనుంచి బయటపడ్డాడు. ఒక్క క్షణం వాడికేమీ అర్ధంకాలేదు. తలబలంగా రాళ్లగుట్టకేసి కొట్టుకుంది. చివ్వున రక్తం చిమ్మింది.

శీను బలవంతంగా కళ్లు తెరిచి చూశాడు. వేగంగా పరిగెత్తుతున్న రైలు, కంగారుగా తనవైపు చూస్తున్న ప్రయాణికులూ, విశాలమైన ఆకాశం ఇవే కన్పించాయి శీనుకి చివరిసారిగా, ఆ తర్వాత శీను కళ్లు శాశ్వతంగా మూతలు పడిపోయాయి.

ఓబులమ్మ చేదతో నీళ్లు తోడుతోంది. అదాటుగా బొక్కెనలోకి వచ్చింది ఓ చిరు కప్ప. బొక్కెన పైకంటూ వచ్చాక గట్టుమీద పెట్టింది.

అప్పుడే శీను మరణవార్త తెచ్చిన కోటిగాడు అక్కడికొచ్చాడు. వాడిముఖంలో కంగారు చూసి ఓబులమ్మ ఆత్రంగా అటువైపు పరిగెత్తింది.

బొక్కెనలోని కప్ప మాత్రం ఆశ్చర్యంగా చుట్టూ చూసింది. ఎంతో కాలంగా అది బావిలోనే ఉంది. అక్కడే పుట్టి పెరిగింది. దానికి తెల్సిన లోకమంతా బావే.

ఇప్పుడు చుట్టూ వున్న చెట్లు, మనుషులు, పొలాలు, పెద్ద ఆకాశం ఇవన్నీ చాలా విచిత్రంగా అన్పించాయి కప్పకి. తనకి తెలీకుండా ఇంత పెద్ద ప్రపంచం వుందా అనుకుంది. సృష్టిలోని వింతలన్నీ చూద్దామని నేలమీదకి ఒక్క గెంతు గెంతింది. కానీ పొరపాటున మళ్లీ బావిలోనే పడింది. దిమ్మెర పోయిన కప్ప చుట్టూ చూసింది.

చుట్టూ వలయంలాంటి నీళ్లు...
పైన చిన్న పళ్లెంలాంటి ఆకాశం...



తీపి మనిషి

ఆయన మాటలెలా ఉన్నా, మనిషి మాత్రం తీపే. ఆయన దేన్ని ముట్టుకుంటే అది కూడా తీపే. అందుకే ఆయన్ని ఆ ఊళ్ళో అందరూ 'తీపి మనిషి' అంటారు. నా తీపిదనం అందరికీ తియ్యగా ఉన్నా, నాకు మాత్రం వెగటుగా ఉందని నెత్తీ నోరూ బాదుకుంటున్నాడు భానుదాస్ గైక్వాడ్. గైక్వాడ్ లోహాన్ని, కొయ్యని, నీళ్ళని దేన్ని తాకితే అది తియ్యగా మారిపోతుంది. ఈ తీపి మనిషిలోని వింతని వైద్య శాస్త్రం కూడా పసిగట్టలేకపోయింది. అయితే ఆయనకు ఏ రోగం లేదని మాత్రం నిర్ధారించగలిగింది. ఆయన రక్తాన్ని, శరీర కణాల్ని పరిశోధన కోసం న్యూయార్క్ పంపారు.

ఈ స్వీటు మనిషితో చేతులు కలిపి ఆ తీపి గుర్తును మరిచిపోలేని వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. ఈ స్వీట్ హేండ్ షేక్ కోసం జనం క్యూలో వున్నారు.

1981కి ముందు గైక్వాడ్ అందరిలాగే హాయిగా ఉండేవాడు. ఒక రోజు ఒక చెట్టుకింద తీపి కలలు కంటూ నిద్రపోతుంటే ఎవరోలేపుతున్నట్టు అనిపించిందట. అతే గైక్వాడ్ స్వీటు మనిషిగా మారిపోయాడు. ఆ రాత్రి మిరపకాయలు తిన్నా ఈయనకు తియ్యగానే అనిపించింది. నమ్మకం కుదరక మళ్ళీ మళ్ళీ పరీక్షించుకున్నాడు. ఇంకేముంది ఏది తిన్నా తీపే. తన శక్తిని ప్రదర్శించడం మొదలు పెట్టాక తీపి మనిషి కాస్త చేదు అనుభవాలు రుచి చూడాల్సి వచ్చింది. జనాన్ని మోసం చేస్తున్నాడని, నిందలు పడాల్సి వచ్చింది. అనేక ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత, రెండు సైకిళ్ళను స్వీట్ సైకిల్స్‌గా మార్చిన తర్వాత ఈయన్ని నిజమైన తీపి మనిషిగా గుర్తించారట.